# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




జనగామ మున్సిపాలిటీ పరిసరాల్లో

## నిషేధాజ్ఞలు అమలు

- సీపీ సన్ ప్రీత్ సింగ్

3 లో

సంపుటి : 01 | సంచిక : 81 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 17 ఫిబ్రవరి 2026 | పేజీలు : 5




# సమావేశంలో రభస

### పోడియం వద్ద కాంగ్రెస్.. కార్యాలయం ముందు బీఆర్ఎస్..!



- జనగామ మున్సిపాలిటీలో హైడ్రామా!
- కోరం ఉన్నా.. చైర్మన్ ఎన్నిక వాయిదా!
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేత మధ్య మాటల యుద్ధం
- కాంగ్రెస్ నేతలను గుండాలన్న ఎమ్మెల్యే పల్లా
- ఎమ్మెల్యేపై కిడ్నాప్ ఆరోపణలు చేసిన ఎంపీ చామల
- పట్టణంలో ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జి

జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు తీరుతో ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్, ఆర్డీవో గోపీరాం చైర్మన్ ఎన్నికను వాయిదా వేయాల్సి వచ్చింది. మరోవైపు ఓ బీఆర్ఎస్ కౌన్సిలర్ కిడ్నాప్ కు గురయ్యారనే ఫిర్యాదుతో పోలీసులు బీఆర్ఎస్ వాహనాన్ని ఆపడం.. పార్టీ కార్యకర్తలు పోలీసులుకు అడ్డురావడంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారి లాఠీచార్జి వరకు వెళ్లింది. మొత్తం సాఫీగా సాగుతుందనుకున్న కౌన్సిల్ సభ్యుల సమా'వేషం'లో రభస నెలకొంది.

2

- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా



## మమ్మల్ని ఎవరూ కిడ్నాప్ చేయలేదు

- పోలీసులు కావాలని మమ్మల్ని వేధిస్తున్నారు
- 28వ వార్డు కౌన్సిలర్ హఫీజ్ ఫాతిమా

2 లో



## మౌనిక అలక

- బీఆర్ఎస్ చైర్ పర్సన్ అభ్యర్థిగా జోరుగా ప్రచారం
- చివరి క్షణంలో మారిన సమీకరణలు

4 లో




# సమావేశంలో రభస

జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు తీరుతో ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్, ఆర్డీవో గోపీరాం చైర్మన్ ఎన్నికను వాయిదా వేయాల్సి వచ్చింది. మరోవైపు ఓ బీఆర్ఎస్ కౌన్సిలర్ కిడ్నాప్ కు గురయ్యారనే ఫిర్యాదుతో పోలీసులు బీఆర్ఎస్ వాహనాన్ని ఆపడం.. పార్టీ కార్యకర్తలు పోలీసులుకు అడ్డురావడంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారి లాఠీచార్జి వరకు వెళ్లింది. మొత్తం సాఫీగా సాగుతుందనుకున్న కౌన్సిల్ సభ్యుల సమా'వేశం'లో రభస నెలకొంది.

**- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా**

## కౌన్సిల్ పోడియం వద్ద కాంగ్రెస్.. కార్యాలయం ముందు బీఆర్ఎస్..!

- జనగామ మున్సిపాలిటీలో హైడ్రామా!
- కోరం ఉన్నా.. చైర్మన్ ఎన్నిక వాయిదా!
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేత మధ్య మాటల యుద్ధం
- కాంగ్రెస్ నేతలను గుండాలన్న ఎమ్మెల్యే పల్లా
- ఎమ్మెల్యేపై కిడ్నాప్ ఆరోపణలు చేసిన ఎంపీ చామల
- పట్టణంలో ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జి



జనగామ మున్సిపల్ ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. 30 మంది సభ్యులు ఉన్న ఈ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి 13, బీఆర్ఎస్‌కు చెందిన 13 మంది కౌన్సిలర్లుగా గెలుపొందారు. నలుగురు ఇండిపెండెంట్లుగా విజయం సాధించారు. ఈ నలుగురు ఇండిపెండెంట్లు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో కీలకంగా మారారు. 5వ వార్డుకు చెందిన మిద్దెపాక భాస్కర్, 15వ వార్డు కౌన్సిలర్ మారబోయిన పాండులు కాంగ్రెస్ గూటికి చేరగా, 8వ వార్డ్ కౌన్సిలర్ సందుపట్ల మంజుల, 23వ వార్డు కౌన్సిలర్ భూష పర్వతాలు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారు. ఇక వీరితో పాటు ఇద్దరు ఎక్స్ అఫీషియో మెంబర్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్‌కు, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కాంగ్రెస్‌కు ఉండడంతో ఇరు పార్టీలకు 16:16 ఓట్లతో సమాన బలం ఉంది.

### సాదాసీదాగా ప్రమాణ స్వీకారం..

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, చైర్మన్ల ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. జనగామలో మాత్రం సాదాసీదాగా నిర్వహించారు. సమావేశంలో ఎలాంటి డయాస్ ఏర్పాటు చేయకపోవడంతో అభ్యర్థులు వారి సీట్ల వద్ద నిలబడి ప్రమాణ పత్రం చదివారు. ఎన్నికల తర్వాత క్యాంపునకు వెళ్లిన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు అక్కడి సోమవారం నేరుగా మున్సిపాలిటీకి చేరుకున్నారు. ఆర్డీవో గోపీరాం సమావేశం ప్రారంభించి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అక్షర క్రమంలో అండాలు తిరువైపడి, అనిత దోర్నాల, ఆరుట్ల రాం నర్సింహా రెడ్డి, ఉడుగుల కిష్టయ్య, ఎనగందుల అనుష, కడకంచి బాలమణి, కడమంచి సుశీల, కమర్, గంగరబోయిన అనిత, గునిగంటి వెన్నెల, గోపగాని సుగుణాకర్, చెంచారపు కరుణాకర్ రెడ్డి, జ్యోతి బూడిద, పర్వతాలు భూష, పానుగంటి సువార్త, పాముకుంట్ల ప్రసాద్ కుమార్, బాల భరద్వాజ్ బుక్కా, మంజుల సందుపట్ల, మంత్రి సుమలత, మారబోయిన పాండు, మిద్దెపాక భాస్కర్, ముస్త్యాల మౌనిక, రజిత మామిడాల, రజిని దావెర, రామగళ్ల విజయ్ కుమార్, వంగ ఉమ, సజ్జ దుర్గా ప్రసాద్, సేవెల్లి మధుసూదన్, హఫీజ్ ఫాతిమా ప్రమాణ స్వీకారం చేశారు.









## చైర్మన్ అభ్యర్థుల ప్రతిపాదన తర్వాతే..

# అసలు వ్యూహం..!

- అప్పటి వరకు మాటాముచ్చట.. ఆ వెంటనే నిరసన దిగిన నేతలు

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ మున్సిపాలిటీలో జరిగిన చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్ అభ్యర్థిగా కడకంచి బాలమణి పేరును 15వ వార్డు కౌన్సిలర్ పాండు సూచించారు. ఇక బీఆర్ఎస్ పార్టీ నుండి చైర్మన్‌గా 17వ వార్డు కౌన్సిలర్ ఉడుగుల కిష్టయ్య ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ గుడిగంటి వెన్నెల సమర్థించారు. ఈ విషయాన్ని ఆర్డీవో గోపీరాం ప్రకటించగానే అసలు వ్యూహం మొదలైంది. కౌన్సిలర్లు వారి వారి చైర్మన్ అభ్యర్థులను బలపరచాలని ఆర్డీవో కోరిన వెంటనే.. ఎంపీ చామల లేచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు కౌన్సిలర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, రేపటి వరకు చైర్మన్ ఎన్నికను వాయిదా వేయాలని కోరారు. కానీ ఆర్డీవో కోరం ఉన్నప్పుడు వాయిదా ప్రస్తావన ఉండబోదని స్పష్టం చేశారు. దీంతో ఎంపీతో పాటు కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు పోడియం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. పూర్తి కోరం ఉన్నందున ఎన్నికలు వాయిదా వేసే అవకాశం లేదని గోపి రామ్ పదేపదే చెబుతూ వచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే సభ్యులకు స్వేచ్ఛ కావాలని, అందువల్ల రేపటి వరకు వాయిదా వేయాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టడంతో ఆందోళన వాతావరణం నెలకొంది. దీంతో చేసేదిలేక ఆర్వో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.




### మున్సిపల్ ముందు బీఆర్ఎస్...

కౌన్సిల్ లో వాయిదా ప్రకటన వెలువడిన వెంటనే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా ఆ పార్టీకి చెందిన 15 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పోలీస్ బలగాలను ఉపయోగించి చైర్మన్ ఎన్నికను వాయిదా వేయించిందని ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు తనను, తమ కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇక డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండరీ చేతన్‌లు కాంగ్రెస్‌కు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు కేసులు నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. కాగా, వాయిదా ప్రకటన అనంతరం కౌన్సిలర్లు తిరిగి క్యాంపునకు వెళ్లిపోయారు.

# మమ్మల్ని ఎవరూ కిడ్నాప్ చేయలేదు

- 28వ వార్డు కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమా సమద్



**జనగామ, మన చౌరాస్తా :** తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని 28వ వార్డు కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమా సమద్ స్పష్టం చేశారు. 11వ తేదీ పోలింగ్ పూర్తయిన తర్వాత తన పిల్లల ఆరోగ్యం బాగాలేకుంటే తాను, తన భర్త హైదరాబాద్ హాస్పిటల్‌కు వెళ్లామని తెలిపారు. అక్కడి నుంచి సోమవారం నేరుగా మున్సిపల్ ఆఫీస్‌కు వచ్చామని వివరించారు. తమను ఎవరూ కిడ్నాప్ చేయాలని పోలీసులకు స్పష్టం చేసినా వెంటాడి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తాను బీఆర్ఎస్ బీ ఫాంపై గెలిచాను. బీఆర్ఎస్ తోనే ఉంటానని హాఫీజ్ ఫాతిమా సమద్ స్పష్టం చేశారు.



# జనగామ రణరంగం

- బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జ్
- ఎమ్మెల్యే పల్లా వరెస్స్ డీసీపీ రాజమహేంద్ర నాయక్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో జనగామలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నిక నేపథ్యంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తమ కౌన్సిలర్లు, అనుచరలతో మున్సిపల్ కార్యాలయానికి వస్తున్న క్రమంలో ర్యాలీకి పర్మిషన్ లేదంటూ అడ్డుకున్నారు. అంతే కాకుండా 29వ వార్డు కౌన్సిలర్ హఫీజ్ ఫాతిమా కేసు నేపథ్యంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్ మహిళా పోలీసులతో కలిసి ఆమె అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో మున్సిపల్ కార్యాలయానికి కూత వేటు దూరంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు వస్తున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

దీంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, డీసీపీ



రాజమహేంద్ర నాయక్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే వెంటనే డీజీపీ, సీపీలతో ఫోన్ మాట్లాడారు. అక్కడి మున్సిపల్ కార్యాలయం చేరుకున్నా కూడా.. పోడియం వద్ద కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో పోలీసులు మిన్నకుండి పోయారు. కానీ.. సమావేశం వాయిదా తర్వాత మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్ గుండాలకు.. పోలీసులు.. డీసీపీ.. తొత్తుగా మారి పనిచేస్తున్నారు..' అంటూ డీసీపీపై విమర్శలు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.







జనగామ మున్సిపాలిటీ పరిసరాల్లో

## నిషేధాజ్ఞలు అమలు

- సీపీ సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, మన చౌరాస్తా :** మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక నేపథ్యంలో జనగామ మున్సిపల్ కార్యాలయ వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో మున్సిపల్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు ప్రకటించారు. నేడు ఉదయం 6 గంటల నుంచి రేపు ఉదయం 6 గంటల వరకు ఇవి అమలులో ఉంటాయని, ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నేరమని హెచ్చరించారు.

## హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గానికి

# మంత్రి పొన్నం శుభాకాంక్షలు

- పట్టణ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కొత్త పాలకవర్గాన్ని అభినందిస్తూ పట్టణ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మలను కుర్చీలో కూర్చోబెట్టి మంత్రి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి ఆశించి తమపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను గెలిపించారని తెలిపారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమే అయినప్పటికీ, ఎన్నికల తర్వాత అభివృద్ధి కోసం అన్ని పార్టీలు కలిసి పని చేయాలని ఆయన సూచించారు. హుస్నాబాద్‌ను చుట్టుపక్కల జిల్లా కేంద్రాల మాదిరిగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని, మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. శానిటేషన్, తాగునీరు, వీధి దీపాలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల మెరుగుదలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా మోడల్ పట్టణంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్ దండి లక్ష్మీ మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల్లో సమగ్ర అభివృద్ధి చేపడతామని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రజల్లోకి తీసుకెళ్లి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ మంత్రి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. వైస్ చైర్మన్ చిత్తారి పద్మ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తానని తెలిపారు. అందరితో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో మంత్రి తీసుకుంటున్న చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని ఆమె స్పష్టం చేశారు.




















# ముస్త్యాల మౌనిక అలక

- బీఆర్ఎస్ చైర్ పర్సన్ అభ్యర్థిగా జోరుగా ప్రచారం
- చివరి క్షణంలో మారిన సమీకరణలు

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ మున్సిపల్ ఎన్నికలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఎన్నికల ప్రకటన అనంతరం ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలోకి వెళ్లింది. ఇక పట్టణంలో 28వ వార్డు నుంచి ఎమ్మెల్యే పల్లా అనుచరుడిగా పేరున్న మాజీ కౌన్సిలర్ ముస్త్యాల దయాకర్ సతీమణి మౌనిక బరిలో దిగి విజయం సాధించారు. అయితే బహిరంగ ప్రకటన లేకున్నా ఆమె చైర్మన్ అభ్యర్థిగా అంతా అనుకున్నారు. కానీ సోమవారం అనూహ్యంగా 18వ వార్డు కౌన్సిలర్ గోపగాని సుగుణాకర్‌ను బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో మౌనిక ఒకింత షాక్ గురయ్యారు. కౌన్సిల్ వాయిదా ప్రకటన అనంతరం బీఆర్ఎస్ కౌన్సిలర్లు అంతా ఎమ్మెల్యేతో కలిసి మున్సిపల్ ముందు నిరసన తెలిపారు. అసమయంలో మౌనిక వెనుక వరుసలో మౌనంగా నిలబడిపోయింది. ఆ తర్వాత అందరికంటే ముందు చకచకా మున్సిపల్ కార్యాలయంలో నుంచి బయటకు వస్తుంటే.. ఎమ్మెల్యేతో పాటు మిగతావారు ఆమెను అసరించి వడివడిగా వచ్చి క్యాంపునకు వెళ్లే బస్సులో ఎక్కించారు. మరి మౌనిక అలక చిలికిచిలికి గాలి వానలా మారకముందు బీఆర్ఎస్ గుర్తిస్తుందా..! లేదా..! వేచిచూడాలి.



# లారీ ఢీకొన్న స్కూల్ వ్యాన్

- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- బస్సులో 50 మందికి పైగా విద్యార్థులు
- ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. స్కూల్ వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. వ్యాన్‌లో 50 మందికి పైగా విద్యార్థులు ఉండగా ఇద్దరు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం, హుస్నాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న లారీ, కొత్తకొండ దిశ నుంచి వస్తున్న శ్రీ చైతన్య పాఠశాల స్కూల్ వ్యాన్‌ను యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ఢీకొట్టింది. ఢీకొట్టడంతో వ్యాన్ క్లీనర్‌తో పాటు ఒక విద్యార్థిని కింద పడిపోయారు. మరో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు అయ్యాయి.

### స్థానికుల సకాల స్పందన..

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు విద్యార్థులను సురక్షితంగా వ్యాన్ నుంచి బయటకు దించారు. ఒక్కసారిగా జరిగిన ఘటనతో విద్యార్థులు భయంతో ఏడ్చిపోతుండగా సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఘటనాస్థలానికి చేరుకుని పిల్లల పరిస్థితి తెలుసుకున్నారు.

### రహదారి సమస్యలేనా?

ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నప్పటికీ సరైన వెడల్పు లేకపోవడం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి పెద్ద ప్రమాదం తప్పిందని, వెంటనే రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.



# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- **సోమేశ్వరాలయంలో రథోత్సవం, బండ్లు తిరుగుట**

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు, మహా జాతర కొనసాగుతోంది. భక్తుల రద్దీ ఏకధాటిగా కొనసాగుతోంది. స్వామి వార్ల దర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతుంది. బ్రహ్మోత్సవాలు భాగంగా సోమవారం రథోత్సవం, బండ్లు తిరుగుటకార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకుర్తి వీధుల్లో రథోత్సవాన్ని ఊరేగింపుగా చేపట్టారు. ఈవో లక్ష్మీ ప్రసన్న ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. అన్ని శాఖల అధికారులు జాతరలో పాలుపంచుకుంటున్నారు.





## స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ చైర్మన్‌గా


# తాటికొండ వినయ్ కుమార్ ఎన్నిక

- **వైస్ చైర్ పర్సన్‌గా నీల రాజమ్మ**
- **ప్రమాణ స్వీకారం చేయించిన ప్రిసైడింగ్ అధికారి**

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా తాటికొండ వినయ్కుమార్ ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్ పర్సన్‌గా నీల రాజమ్మను ఎన్నుకున్నారు. సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయాల్లో నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో గెలుపొందిన నూతన పాలకవర్గ సభ్యులచే ప్రిసైడింగ్ ఆఫీసర్, ఆర్డీవో డిఎస్ వెంకన్న సోమవారం




ప్రమాణ స్వీకారం చేయించారు. ఉదయం 11 గంటలకు సభ్యులచే ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రమాణ స్వీకారం చేయించి అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా తాటికొండ వినయ్ కుమార్‌ను గుర్రం హరినాథ్ ప్రతిపాదించగా బొల్లు లక్ష్మి బలపరిచారు. అలాగే వైస్ చైర్ పర్సన్ గా రాజమ్మ నీలను పొన్న రవి ప్రతిపాదించగా అంగడి రజిత బలపరిచారు. ఈ ఇద్దరిని ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం మెజార్టీ సభ్యులు ఎంచుకున్నారు. అనంతరం చైర్మన్ , వైస్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన వారితో ప్రిసైడింగ్ అధికారి డిఎస్ వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించి, సంబంధిత ధ్రువపత్రాలను వారికి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ పాల్గొన్నారు.





## చేర్యాల మున్సిపల్ పీఠం

# బీఆర్ఎస్ కైవసం

- **చైర్ పర్సన్‌గా ముస్త్యాల అరుణ**
- **వైస్ చైర్ పర్సన్ గా మేడిశెట్టి ఉమా**

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోగా మున్సిపల్ చైర్ పర్సన్ గా ఆ పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ ముస్త్యాల అరుణ బాల నరసయ్య, వైస్ చైర్ పర్సన్‌గా 10వ వార్డ్ కౌన్సిలర్ మేడిశెట్టి ఉమా శ్రీధర్ ఎన్నికయ్యారు. చేర్యాల పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి కార్యాలయంలో నోడల్ ఆఫీసర్, డిపిఓ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం ఆ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికకు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఏడుగురు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఐదుగురు హాజరయ్యారు. ముందుగా 11 గంటలకు నూతనంగా ఎన్నికైన 12 వార్డుల కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషములకు చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించారు. చైర్ పర్సన్ గా బీఆర్ఎస్ పార్టీకి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ ముస్త్యాల అరుణను 2వ వార్డు కౌన్సిలర్ కమలాపురం గీతాంజలి ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ వీరబత్తిని సదానందం బలపరచగా సగానికి పైగా బలం ఉండడంతో అరుణను ఎన్నికను అధికారులు ప్రకటించారు. అదే క్రమంలో వైస్ చైర్‌పర్సన్ పదవికి 10వ వార్డు అభ్యర్థి మేడిశెట్టి ఉమా శ్రీధర్ పేరును 4వ వార్డు కౌన్సిలర్ నిమ్మ సుప్రజా రాజీవ్ రెడ్డి ప్రతిపాదించగా 11వ వార్డు కౌన్సిలర్ ఇజాజ్ అహ్మద్ బలపరచగా సగానికి పైగా బలం ఉండడంతో ఆమెను వైస్ చైర్మన్ గా ప్రకటించారు. అయితే చైర్మన్ ఎన్నిక జరుగుతున్న క్రమంలో బీఆర్ఎస్ పార్టీకి సరిపోయే బలం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లలో 1వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన ఒగ్గు వెంకటమ్మ చేతి ఎత్తి ఓటు వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. సమావేశంలో పార్టీ కండువా వేసుకోకపోవడం బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయడంలో పలు అనుమానాలకు తావిచ్చింది. ఎన్నిక అనంతరం అధికారులు అరుణ, ఉమాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నిక సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా హుస్నాబాద్ ఏసీపీ సదానందం ఆధ్వర్యంలో చేర్యాల సిఐ రమేష్, ఎస్సై నవీన్ తో పాటు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**